సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



జోరుగా.. హుషారుగా..

'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్)లో భాగంగా నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా జరుగుతున్నాయి.

–8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.60,680
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,420
3 శాతం జీఎస్టీతో	రూ.5,583
నవర (8 గ్రా)	రూ.44,664

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.6 /22.5

గురువారం గాలిలో 74 శాతం తేమ ఉంది. శుక్రవారం చలితో కూడిన పొడి వాతావరణం ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

షేర్‌మార్కెట్‌లో నష్టాలు

- అప్పులపాలై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టగా.. నష్టాలు రావడంతో అప్పులపాలై ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరులోని పుల్లమ్మసత్రం ప్రాంతంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం కొత్తపాళేనికి చెందిన పవన్‌కుమార్ (34)కు లక్ష్మీదాత్రి భవానీతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. పవన్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వారికి గిరీష్, విషికా అనే పిల్లలున్నారు. 2020లో పవన్‌కుమార్ కుటుంబంతో కలిసి నెల్లూరుకు వచ్చాడు. నెల్లూరు పుల్లమ్మసత్రం ప్రాంతంలో ఇల్లుఅద్దెకు తీసుకుని వర్క్‌ఫ్రమ్ హోం విధానంలో పనిచేస్తున్నాడు. షేర్‌మార్కెట్‌లో అతను భారీగా పెట్టుబడులు పెట్టాడు. అక్కడ నష్టాలు రావడంతో అప్పులపాలయ్యారు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయారు. ఈ విషయాన్ని గమనించిన పవన్ తండ్రి, సోదరుడు కొంత అప్పులు తీర్చారు. అయినా అతను లోలోపల మదనపడసాగాడు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం పనిచేసుకుంటానని భార్యకు చెప్పి తన గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటికి భార్య వెళ్లి తలుపు కొట్టినా, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆమె జరిగిన విషయాన్ని మరిది సతీష్‌కు తెలియజేసింది. సతీష్, ఆయన భార్య వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అందరూ కలిసి స్థానికుల సహకారంతో తలుపులు పగులగొట్టి చూడగా పవన్‌కుమార్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందకి దించి అపోలో హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఉద్యోగం నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ తొలగింపు

ఉలవపాడు: అవకతవకలు పాల్పడడంతో మండల పరిధిలోని బద్దిపూడి సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కె.చంద్రశేఖర్‌ను ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు మళ్లీ ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత లేదని కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ చెంచమ్మ గురువారం వివరాలు తెలియజేశారు. చంద్రశేఖర్ గతంలో జలదంకి మండలం చామదల సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పెన్షన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడినందుకు సస్పెండ్ చేశారు. దీనిపై కావలి డివిజనల్ పంచాయతీ అధికారి కనకదుర్గ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి కె.పెంచలయ్య గతేడాది నవంబర్‌లో విచారణ చేశారు. చంద్రశేఖర్ వివరణ ఇచ్చాడు. తనపై జాలి చూపించాలని అధికారులను కోరాడు. దీంతో సస్పెన్షన్ ఎత్తివేసి ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామానికి బదిలీ చేశారు. కాగా విచారణ కమిటీ నివేదికను పరిశీలించిన కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు మరే ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత లేదని ఉత్తర్వులిచ్చారు. వీటిని అమలు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

కోవూరు: సంగంలోని గంగమ్మ ఆలయంలో చోరీకి ప్రయత్నించి అక్కడ ఉన్న హుండీని పగులకొట్టిన కేసులో మల్లిక శీనయ్య అనే వ్యక్తిని 2019 ఏప్రిల్ 19న అప్పటి సంగం ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేశారు. దీనిపై కోర్టులో నేరం రుజువు కావడంతో శీనయ్యకు ఏడాది జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో నెల జైలు శిక్ష అనుభవించాలని అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె.కాత్యాయిని గురువారం తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ఏపీపీ మాల్యాద్రి వాదించారు.

పౌర సరఫరాల సంస్థ డీఎంగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

నెల్లూరు(అర్బన్): సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ (జిల్లా పౌర సరఫరాల సంస్థ) జిల్లా మేనేజర్‌గా డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు గురువారం వేదాయపాళెంలోని ఆ సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి హోదాలో ఆ సంస్థ జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్న ఎంపీ సుధాకర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమవుతున్నాయన్నారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు, గోతాలు తదితర విషయాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తన భాండాగారం



ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. రైతులకు ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు ఉదాహరణే లింగసముద్రం మండలంలోని చినపవని గ్రామం వద్ద ఉన్న విత్తనాభివృద్ధి కేంద్రం. అడవిని తలపించే భూములను వ్యవసాయానికి అనుకూలంగా మార్పు చేశారు. మేలైన విత్తనాల ఉత్పత్తే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.

- ఒకప్పుడు చినపవనిలో వృథాగా వందల ఎకరాలు
- ప్రభుత్వం చొరవతో విత్తనాభివృద్ధి కేంద్రం ఏర్పాటు
- అందుబాటులో శాస్త్రవేత్తలు, సిబ్బంది
- మేలైన విత్తనాల ఉత్పత్తే లక్ష్యం
- వందల ఎకరాల్లో పంటలు సాగు



నేడు విత్తనాభివృద్ధి కేంద్రం ఇలా..



నాడు వ్యవసాయ క్షేత్రం ఇలా..

లింగసముద్రం: మండలంలోని చినపవని గ్రామం వద్ద ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారికి వ్యవసాయ భూములున్నాయి. చాలా సంవత్సరాలుగా ఇక్కడ సాగు జరగడం లేదు. అన్నదాతల కోసం ఆ భూములను విత్తనాభివృద్ధి కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మూడు సంవత్సరాల క్రితం వ్యవసాయ విశ్వవిద్యాయం అధికారులు సదరు భూములను పరిశీలించారు. అప్పటికి ఆ ప్రాంతమంతా కంపచెట్లతో నిండి అడవిని తలపిస్తోంది. ఎటువంటి వసతులు కూడా లేవు. ప్రభుత్వం ఆ భూముల్లోని 410.30 ఎకరాలను విత్తనాభివృద్ధి కేంద్రం కోసం 2021 సంవత్సరం ఏప్రిల్ నెలలో కేటాయించింది.

సిబ్బంది నియామకం

వర్సిటీ అధికారులు భూములను సందర్శించి విత్తనాభివృద్ధి కేంద్రం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించారు. చినపవని గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని కార్యకలాపాలు ప్రారంభించారు. ఇద్దరు శాస్త్రవేత్తలను నియమించారు. ఒకరు క్షేత్రస్థాయిలో, మరొకరు విశ్వవిద్యాలయంలో ఉంటారు. ఇంకా 8 మంది సహాయ సిబ్బందిని నియమించారు. పనులు వేగంగా జరిగేందుకు ఒక ట్రాక్టర్, ఒక బొలెరో వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. అతి తక్కువ సమయంలో కంపచెట్లను తొలగించి భూమిని సాగులోకి తీసుకొచ్చారు. ఇక్కడ నిరుపయోగంగా ఉన్న గోదాము, స్టోర్‌రూమ్‌ను కూడా ఉపయోగంలోకి తెచ్చారు.



విత్తనాభివృద్ధి కేంద్రంలో వేసిన నువ్వుల పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సాగు ఇలా..

విత్తనాభివృద్ధి కేంద్రంలో సాగు పనులు జోరుగా జరుగుతున్నాయి. గతేడాది భూసారం పెంచేందుకు 200 ఎకరాల్లో జనుము పంటను, 50 ఎకరాల్లో టీబీజీ–104 రకం మినుము పంట, 50 ఎకరాల్లో వైఎల్ఎం 66 రకం నువ్వు పంటను విత్తన ఉత్పత్తి కోసం సాగు చేశారు. రైతులకు అధిక దిగుబడినిచ్చే మేలైన విత్తనాలను అందించేందుకు 2022–23 సంవత్సరంలో రబీలో 250 ఎకరాల్లో జనుము, టీబీజీ 104 రకం మినుము, ఐపీఎం 2–14 రకం పెసర, వైఎల్ఎం 66 రకం నువ్వుల పంటలను సాగు చేస్తున్నారు.

వివిధ పనులు

రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌కేవీవై రాఫ్టర్ ప్రాజెక్టు కింద ఇచ్చి నిధులతో కేంద్రంలో వివిధ పనులు చేపట్టారు. వ్యవసాయ సిబ్బందికి అవసరమైన శిక్షణ, ఆఫీస్ బిల్డింగ్, గోదాము, త్రెషింగ్ ఫ్లోర్, భూముల చుట్టూ ఫెన్సింగ్ వంటి పనులు జరుగుతున్నాయి. అదే విధంగా అవసరమైన ట్రాక్టర్లు, పనిముట్లు కొనుగోలు చేశారు. ఇంకా కేంద్రంలో పంట కాలువలు, నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా నిధులతో బోర్లు వేయించడం, ఆఫీస్‌కు సంబంధించిన ఫర్నీచర్, కంప్యూటర్లను కొనుగోలు చేశారు.

మేలైన విత్తనాల కోసం సంప్రదించండి



అన్నదాతలకు మేలైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా విత్తనాభివృద్ధి కేంద్రం కృషి చేస్తోంది. ఈ కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రైతులకు అండగా నిలుస్తాం. అన్నదాతలు మేలైన విత్తనాల కోసం కోసం సంప్రదించండి.

– డా.నాగార్జున, చినపవని విత్తనాభివృద్ధి కేంద్రం శాస్త్రవేత్త

సోమశిలలో 68.526 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 68.526 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 1894 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 3,920, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.287 మీటర్ల నీటి మట్టం ఉంది.

హెల్మెట్ ధరించడం మరిచిపోవద్దు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి సూచన



హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: మోటార్‌బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా వెంకటాచలంలో గురువారం సాయంత్రం బైక్ ర్యాలీని మంత్రి కాకాణి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాన్ని నడిపారు. అనంతరం మాట్లాడుతూ 90 శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయన్నారు. రహదారి నిబంధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ వాహనాలను నడపాలన్నారు. నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆదాల కార్యాలయం వద్ద సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో గురువారం నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయం వద్ద సంబరాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో కోలాహలం నెలకొంది. బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎవరి మనసు నొప్పించకుండా తన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేకుండా సామాన్యుడిగా మెలుగుతున్న ఎంపీ ఆదాలను రూరల్ సమన్వయకర్తగా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ప్రభాకర్‌రెడ్డితో తనకు అనేక సంవత్సరాలుగా సత్సంబంధాలున్నాయన్నారు. ఆయన ఎవరికీ హాని చేసే వ్యక్తి కాదన్నారు. అటువంటి వ్యక్తి నాయకుడిగా ఉంటే ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆదాలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అందరి సహకారం అవసరమని, తనవంతు కూడా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొండ్రెడ్డి రంగారెడ్డి, వైవీ రామిరెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కోటేశ్వరరావు, మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



వసంతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గురవమ్మ

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): మండలంలోని దంపూరు పంచాయతీ గోల్కొండాయితోపు గ్రామానికి చెందిన వసంతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ గురవమ్మ గురువారం నెల్లూరులో వసంతమ్మ చికిత్సపొందుతున్న ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదును అందజేసింది. పెన్షన్ లబ్ధిదారు అయిన వసంతమ్మ పింఛన్ అందజేసిన వలంటీర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

రామనారాయణరెడ్డే రాజ్యాంగేతర శక్తి


- టీడీపీలో ఉన్నప్పుడు ఆత్మకూరులో ఏమి చేశారో అందరికీ తెలుసు
- శ్రీధర్‌రెడ్డి, ఆనం మొదటి నుంచి టీడీపీతో టచ్‌లో ఉన్నారు
- వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): 'ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు ఆత్మకూరులో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించారు. ఆయన ఏమి చేశారో ప్రజలందరికీ తెలుసు.' అని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తనకు రాజ్యాంగపరంగా రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ పదవి ఇచ్చి కేబినెట్ హోదా కల్పించిందని స్పష్టం చేశారు. తనకిచ్చిన పదవి ఏదనే విషయం ఆనం తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదన్నారు. గతంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరి ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా అధికారులు లేకుండా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినప్పుడు రాజ్యాంగేతర శక్తి అనే విషయం అప్పుడు గుర్తుకురాలేదా అని రామనారాయణరెడ్డిని ప్రశ్నించారు. వెంకటగిరిలో ప్రొటోకాల్ పాటించాలని తాను అధికారులను కోరానన్నారు. మున్సిపాలిటీ సమావేశాలు ఆనం ఇష్టానుసారంగా మార్చారని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడటం, ఏది చేసినా అధికారికంగా చేయడం తమ నైజమని స్పష్టం చేశారు. వెంకటగిరితో తమ కుటుంబానికి 60 ఏళ్ల అనుబంధం ఉందని నేటికి అక్కడ తమ ఇల్లు ఉందని, తన ఓటు కూడా అక్కడే ఉందన్నారు. పార్టీలో నుంచి వెళ్లిపోవాలనుకుంటే వెళ్లిపోవాలి కానీ వెంకటగిరిలో నక్సల్స్ ప్రభావం ఉందని, నెల్లూరు ఒక మాఫియా అని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అవసరమైతే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదాలకి నమస్కారం చేయాలి.. లేకుంటే ఇంట్లోనే కూర్చోవాలని ఆనంకు సూచించారు. ఆయనకు ఏ పార్టీలోనూ టికెట్ ఖరారు కాలేదని, అటు సోదరుడు దూరం పెట్టడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో మాట్లాడుతున్నాడన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి ముందు నుంచే టీడీపీకి టచ్‌లో ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా లోకేష్, చంద్రబాబును కూడా వాలిద్దరూ కలిశారన్న విషయం బహిరంగ రహస్యమన్నారు.

ఫోన్ ట్యాపింగ్ నిరూపిస్తే రాజీనామా చేస్తా



- జరగలేదని నేను నిరూపిస్తే రాజీనామా చేస్తావా?
- శ్రీధర్‌రెడ్డికి సిటీ ఎమ్మెల్యే అనిల్ సవాల్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'ఫోన్ ట్యాపింగ్ జరిగిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిరూపిస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. జరగలేదని నేను నిరూపిస్తే నువ్వు రాజీమానా చేస్తావా?' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ సవాల్ విసిరారు. ఆయన గురువారం నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ జరగలేదని, తెలుగుదేశం పార్టీలోకి వెళ్లేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చౌకబారు విమర్శలు చేస్తున్నాడని ఫైర్ అయ్యారు. ఇద్దరం స్పీకర్ ఫార్మెట్‌లో రాజీనామా చేసి స్పీకర్ దగ్గరకు వెళ్దామన్నారు. '24 గంటల సమయం ఇస్తున్నా.. మీరు ఎప్పుడైనా రండి.. నేను రెడీగా ఉంటా.' అన్నారు. టీడీపీతో టచ్‌లో ఉన్న శ్రీధర్‌రెడ్డికి జనవరి 27న ఆ పార్టీ టికెట్ ఖరారైందన్నారు. పార్టీని వీడే సందర్భం వచ్చింది కాబట్టే ఫోన్ ట్యాపింగ్ అంటూ ఏదో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీధర్‌రెడ్డి రెండునెలల ముందు నుంచే పార్టీ మారేందుకు సిద్ధమయ్యారని, ఈక్రమంలో ఏబీఎన్ రాధాకృష్ణతో చర్చలు జరిపారన్నారు. లోకేష్‌తో మాట్లాడాడని చెప్పారు. 'ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటున్నావు. నీకు ధైర్యం ఉంటే నువ్వు వినిపించిన 16 సెకండ్లు కాదు.. మొత్తం 51 సెకండ్లు వినిపించు.. నీ మనోభావాలు రాష్ట్ర ప్రజలు వింటారు.' అని తెలిపారు. ఈరోజు మన కుటుంబాల ఆర్థిక పరిస్థితి బాగుందన్నా... నీకు నాలుగు కార్లు వచ్చాయన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమేనన్నారు. సీఎం రుణం తీర్చుకోలేనిదన్నారు. మా మీద గిట్టని వారు ఎన్నో ఫిర్యాదులు చేసినా జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కమాట కూడా అనలేదన్నారు. సీఎం బొమ్మ ఉంటేనే నీకు ఓట్లు వచ్చేది. లేదంటే 10 వేలు కూడా రావన్నారు. మా నాయకుడిని వదిలి వెళ్లాలనుకుంటే వెళ్లాలి గానీ బురద చల్లితే సహించేది లేదన్నారు.

94.4 శాతం మందికి పింఛన్ల పంపిణీ



కొండాయపాలెం సెంటర్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుప్రియ

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కొనసాగుతోంది. రెండో రోజు గురువారం నాటికి 94.4 మంది లబ్ధిదారులకు కానుక అందింది. మొత్తం 3,10,010 మందికి గానూ 2,92,659 మందికి నగదు ఇచ్చారు. జిల్లాలో పింఛన్ల అందజేతలో రాపూరు, ఇందుకూరుపేట, వెంకటాచలం మండలాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

స్వగ్రామంలో ఫాల్సమ్ సిటీ వైస్ మేయర్



గ్రామస్తులతో ఏడుకొండలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ఫాల్సమ్ సిటీ వైస్ మేయర్‌గా మండలంలోని మన్మథరావుపేట గ్రామానికి చెందిన చలంచర్ల ఏడుకొండలు వ్యవహరిస్తున్నారు. ఆయన గురువారం స్వగ్రామానికి వచ్చారు. చలంచెర్ల చినరమణయ్య, రాజమ్మ దంపతుల నాలుగో సంతానమైన ఏడుకొండలు ఉద్యోగ నిమిత్తం 2,000 సంవత్సరంలో అమెరికాకు వెళ్లారు. ఫాల్సమ్ సిటీలో ఉద్యోగం చేసుకుంటూ 2020 సంవత్సరంలో కౌన్సిలర్ పోటీల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించి ప్రస్తుతం ఆ సిటీకి వైస్ మేయర్‌గా ఉన్నారు. చాలా సంవత్సరాల తర్వాత స్వగ్రామానికి వచ్చిన ఏడుకొండలు తాను ప్రాథమిక విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి చాక్లెట్లు, పెన్నులు అందజేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. యువత లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో సాధించాలని ఏడుకొండలు పిలుపునిచ్చారు.

అడిగిన వెంటనే విద్యుత్ సర్వీస్ మంజూరు



విద్యుత్ సర్వీసులను పరిశీలిస్తున్న ఎస్ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి అడిగిన వెంటనే విద్యుత్ సర్వీస్ ఉచితంగా ఇస్తామని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య తెలిపారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలో నూతనంగా నిర్మించిన జగనన్న ఇళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, లైన్ల ఏర్పాటు పనులు పూర్తి చేశారన్నారు. అనంతరం టిడ్కో గృహ సముదాయాల్లో విద్యుత్ సర్వీసులను పరిశీలించారు. కాలనీలో మరో సబ్‌స్టేషన్ మంజూరుకాగా ఎస్ఈ స్థల పరిశీలన చేశారు. ఎస్ఈ వెంట నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఇంధన పొదుపులో నెల్లూరుకు ప్రథమ స్థానం

- ఏపీ పీటీడీ జోన్‌-3 ఈడీ ఆదాం సాహెబ్‌


రాష్ట్రస్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన డ్రైవర్లను సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్‌) : ఇంధన పొదుపులో నెల్లూరు రీజియన్‌ ప్రథమ స్థానంలో ఉందని, ప్రతి సంవత్సరం దీనిని నిలుపుకునేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఏపీ పీటీడీ జోన్‌-3 ఈడీ కె.ఆదాం సాహెబ్‌ పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్టీసీ టు డిపో గ్యారేజీలో రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ నెల్లూరు రీజియన్‌ను ప్రమాదరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రాణం అత్యంత విలువైనదని, ప్రమాదంలో ఒకరు మృతిచెందితే అతడిపై ఆధారపడిన కుటుంబమంతా తీవ్ర ఇబ్బంది పడుతుందన్నారు. ప్రమాదాల శాతంలో రాష్ట్రంలో అత్యల్ప స్థానంలో నెల్లూరు రీజియన్‌ ఉందన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌ బి.చందర్‌ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గతేడాది రోడ్డు ప్రమాదాల్లో 1.50 లక్షల మంది మృతిచెందారని, రాష్ట్రంలో ఏడువేల మంది, జిల్లాలో 366 మంది మృతిచెందారన్నారు. మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణం, సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయన్నారు. ద్విచక్ర వాహనాల ద్వారా జరిగే ప్రమాదాల్లో 35 శాతం మంది మృత్యువాత పడుతున్నారన్నారు. నగర ట్రాఫిక్‌ డీఎస్పీ అబ్దుల్‌ సుభాన్‌ మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌ వద్ద ఫ్లై ఓవర్‌ ప్రారంభంలో రాంగ్‌రూట్‌లో ఆర్టీసీ బస్సులు వస్తున్నాయని, దీని వల్ల ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. డ్రైవర్లందరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తూ బస్సులు నడపాలన్నారు. ప్రమాద రహిత డ్రైవర్లలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఎంవీ సుబ్బయ్య (ఆత్మకూరు డిపో), తృతీయ స్థానంలో నిలిచిన వై.కృష్ణయ్య(నెల్లూరు-2 డిపో), జోన్‌ పరిధిలో రెండో స్థానంలో నిలిచిన పి.వెంకటేశ్వర్లు (కావలి డిపో), రీజియన్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన షేక్‌.రఫీ (నెల్లూరు-వన్‌ డిపో), ఎం.సుధాకర్‌ (నెల్లూరు-2 డిపో), జె.రమణయ్య (నెల్లూరు-1)తో పాటు డిపోల వారీగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి పీవీ శేషయ్య, నెల్లూరు వన్‌, టు డిపో డీఎంలు మురళీకృష్ణ, శివకేశవ యాదవ్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా

- ఆసక్తికరంగా సాగిన ఎస్పీఎల్‌ క్రికెట్‌ పోటీలు

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

Regional sponsor: APMDC | APMDC FOUNDATION

SPL SAKSHI PREMIER LEAGUE

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఓ వైపు పరుగుల వరద, మరో వైపు కట్టుదిట్టమైన బౌలింగ్‌ నడుమ ప్రేక్షకుల కేరింతలతో ఎస్పీఎల్‌ క్రికెట్‌ పోటీలు గురువారం జోరుగా.. హుషారుగా సాగాయి. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో సాక్షి మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సాక్షి' ప్రీమియర్‌ లీగ్‌ మూడో రోజు ఆసక్తికరంగా సాగాయి. గెలుపు కోసం ఇరుజట్లు పోటీ పడడంతో క్రీడాప్రాంగణం ఆయా జట్లకు మద్దతు పలికే ప్రేక్షకులతో హోరెత్తింది.

నేటి మ్యాచ్‌లు: ఉదయం 8 గంటలకు జగన్స్‌ డిగ్రీ కాలేజీ, నారాయణ ఇంజనీరింగ్‌ కాలేజీల మధ్య మ్యాచ్‌, 10 గంటలకు ఎన్‌బీకేఆర్‌ ఇంజనీరింగ్‌ కాలేజీ (విద్యానగర్‌), నారాయణ ఇంజనీరింగ్‌ కాలేజీ (గూడూరు) జట్లు తలపడనున్నాయి.


మ్యాచ్‌లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

➡ మొదటి మ్యాచ్‌లో జెనెక్స్‌ విజన్‌, జగన్స్‌ డిగ్రీ కాలేజీ జట్లు పోటీ పడ్డాయి. టాస్‌ గెలిచిన జెనెక్స్‌ విజన్‌ జట్టు ఫీల్డింగ్‌ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన జగన్స్‌ డిగ్రీ, పీజీ కాలేజీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. జట్టులోని రామ్‌చందు 34 బంతుల్లో 4 సిక్సర్లు, 6 ఫోర్లతో 64 పరుగులు సాధించాడు. జట్టులోని తేజ్‌కుమార్‌ 2 ఓవర్లలో 14 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టగా, సాయితేజ 2 ఓవర్లలో 3 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జెనెక్స్‌ విజన్‌ జట్టు పది ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. దీంతో జగన్స్‌ డిగ్రీ, పీజీ కాలేజీ జట్టు 25 పరుగుల తేడాతో గెలుపొందింది.


గెలుపొందిన జగన్స్‌ కళాశాల జట్టు


గెలుపొందిన వివేకానంద కళాశాల విద్యార్థులు

➡ రెండో మ్యాచ్‌లో ఆదిశంకర ఇంజనీరింగ్‌ కాలేజీ(గూడూరు), వివేకానంద డిగ్రీ కాలేజీ(నెల్లూరు) జట్లు పోటీ పడ్డాయి. టాస్‌ గెలిచిన ఆదిశంకర ఇంజనీరింగ్‌ జట్టు బ్యాటింగ్‌ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. తదుపరి బ్యాటింగ్‌ చేసిన వివేకానంద డిగ్రీ కాలేజీ జట్టు 9 ఓవర్లలో కేవలం 3 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

➡ మూడో మ్యాచ్‌లో నారాయణ కాలేజీ(గూడూరు), ప్రియదర్శిని కాలేజీ(నెల్లూరు) జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన ప్రియదర్శిని కాలేజీ జట్టు ఫీల్డింగ్‌ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నారాయణ కాలేజీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ప్రియదర్శిని కాలేజీ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది. దీంతో 40 పరుగుల తేడాతో నారాయణ కాలేజీ జట్టు గెలుపొందింది. అంపైర్లుగా చిట్టిబాబు, వాజిద్‌లు, స్కోరర్‌గా వై.యామిని వ్యవహరించారు.


గెలుపొందిన నారాయణ కళాశాల జట్టు(గూడూరు) క్రీడాకారులు

6 నుంచి అసిస్టెంట్‌ ఎలక్ట్రీషియన్‌ కోర్సు ప్రారంభం

నెల్లూరు (టౌన్‌) : స్థానిక వెంకటేశ్వరపురంలోని స్కిల్‌ హబ్‌ శిక్షణా కేంద్రం, ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈనెల 6వ తేదీ నుంచి అసిస్టెంట్‌ ఎలక్ట్రీషియన్‌ స్వల్పకాలిక కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్‌ శ్రీధర్‌రెడ్డి, స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అధికారి వినీల్‌కుమార్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రభుత్వ బాలుర ఐటీఐ లేదా 94944 56326 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కుటుంబ కలహాలతోనే తండ్రిని కడతేర్చాడు

- లారీతో ఢీకొట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రించేందుకు యత్నం
- గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

ఆత్మకూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి కన్నతండ్రినే లారీతో గుద్దించి హతమార్చాడు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రించేందుకు ఆ ప్రాంతం నుంచి వాహనంతో సహా పరారయ్యాడు. అయితే గంటల వ్యవధిలోనే పోలీసులు గుర్తించి రోడ్డు ప్రమాదం కాదని, హత్యేనని వెలుగులోకి తెచ్చారు. ఈ మేరకు ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం శివానగర్‌ టైలర్స్‌ కాలనీకి చెందిన షేక్‌ మహబూబ్‌బాషా (62) లారీ క్లీనర్‌. కుమారుడు మహమ్మద్‌ షఫీ లారీ డ్రైవర్‌. వీరు తరచూ మద్యం మత్తులో ఇంటి వద్ద గొడవ పడుతుండేవారు. దీంతో షఫీ మొదటి భార్య అతని నుంచి విడిపోయింది. ఈ క్రమంలో షఫీ మరో వివాహం చేసుకున్నాడు. వారికి రెండేళ్ల కుమార్తె ఉంది. తండ్రీ కుమారుడు మళ్లీ ఇంటి వద్ద తరచూ గొడవ పడుతుండటంతో షఫీ రెండో భార్య పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమైంది. తన తండ్రి వల్లే కుటుంబంలో గొడవలు వస్తున్నాయని, అతన్ని చంపేందుకు షఫీ పథకం పన్నాడు. తండ్రిని క్లీనర్‌గా ఎక్కించుకుని తిరుపతి జిల్లా డక్కిలిలో సిమెంట్‌ను అన్‌లోడ్‌ చేసేందుకు మంగళవారం రాత్రి బయలుదేరారు. కుటుంబానికి సన్నిహితుడైన చిన ఓబయ్య అదే లారీ ఎక్కాడు. మర్రిపాడు మండలం రాజుపాళెం జంక్షన్‌ సమీపంలో తండ్రీకొడుకులు లారీ దిగి రోడ్డుపై ఘర్షణకు దిగారు. ఇంతలో షఫీ హఠాత్తుగా లారీ ఎక్కి రోడ్డుపై ఉన్న తండ్రిని లారీతో గుద్దించాడు. అనంతరం అతని కాళ్లపై తొక్కుకుంటూ వాహనంతో సహా వెళ్లిపోయాడు. దీనిని చూసి భయపడిపోయిన చిన ఓబయ్య సమీపంలోని పొదల్లో దాక్కున్నాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా మహబూబ్‌ బాషా మృతిచెంది ఉండడంతో మర్రిపాడు పోలీసులకు ఓబయ్య సమాచారం అందించాడు. ఎస్సై పి.విశ్వనాథరెడ్డి, సీఐ కేఎం.నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు డీఎస్పీ కోటారెడ్డి వివరించారు. గంటల వ్యవధిలో కేసు ఛేదించి నిందితుని పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ విజయారావు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

విచారణ సమయంలో ప్రధాన నిందితుడి పరార్‌

- గాలింపు చర్యల్లో స్పెషల్‌ బ్రాంచ్‌ పోలీసులు

సంగం : గొలుసు దొంగతనాల కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడిని సీసీఎస్‌ బృందాలు సంగంలో విచారిస్తుండగా వారి కళ్లుగప్పి అతను పరారైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సీహెచ్‌ విజయారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సేకరించిన వివరాల మేరకు.. నెల్లూరు సీసీఎస్‌ బృందాలు రెండు రోజుల క్రితం గొలుసు దొంగతనాల కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. కేసులో ప్రధాన నిందితుడు నెల్లూరు రూరల్‌ మండలం ఉప్పుటూరుకు చెందిన 32 ఏళ్ల వ్యక్తి. కాగా నిందితుడు ఏఎస్‌పేట, సంగంలో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో సీసీఎస్‌ బృందాలు బుధవారం రాత్రి ఓ ఇన్నోవా కారులో నిందితులిద్దరిని ఏఎస్‌పేటకు తరలించి అక్కడ విచారణ జరిపారు. అనంతరం సంగం కొండ మలుపు వద్ద బీరాపేరు వాగు సమీపానికి వచ్చేసరికి డోరు పక్కనే కూర్చున్న ప్రధాన నిందితుడు పోలీసుల కళ్లు కప్పి డోరు తీసుకుని పక్కనే ఉన్న వాగులోకి దూకేశాడు. దీంతో ఆందోళన చెందిన సీసీఎస్‌ బృందాలు ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు గట్టిగా మందలించారు. సంగం పోలీసుల సహకారంతో సీసీఎస్‌ బృందాలు బీరాపేరు, పెన్నానదిలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. గురువారం సాయంత్రం వరకు కూడా ఎలాంటి ఫలితం లేదు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ముత్తుకూరు : మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ వడ్డిపాళెం అంగన్‌వాడీ స్కూల్‌ వద్ద గురువారం స్థానికులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సుమారు 35 ఏళ్ల పురుషుడు ఒంటిపై దుస్తులు లేకుండా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వ్యక్తి మృతదేహం

రైలు పట్టాలపై..

గుడ్లూరు : రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడి మృతదేహం మండలంలోని తెట్టు-కావలి రైల్వేస్టేషన్ల మధ్య గురువారం గుర్తించారు. కావలి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కావలి జీఆర్పీ పరిధిలో కావలి-తెట్టు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని యువకుని మృతదేహం ఉందని సమాచారం అందుకున్న కావలి రైల్వే ఎస్సై అరుణకుమారి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయసు 25-30 ఏళ్ల మధ్య ఉంటుందని, ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని రైల్వే వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరుణకుమారి తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	రూ.35
సన్నవి	రూ.25
పండ్లు	రూ.8



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ (లైవ్‌)	102
లేయర్‌ (లైవ్‌)	80
బ్రాయిలర్‌ చికెన్‌	184
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	204
లేయర్‌ చికెన్‌	136

